# వైరుధ్యం

యెదిరింటి బి. డి. వో. దామోదరం యింట్లోనుంచి యేడ్పులు వినిపిస్తున్నాయి. దామోదరం వాళ్ళబ్బాయి చనిపోయినట్లుంది. సాను భూతి చూపటానికి వెళ్ళిన శకుంతల యింకా రాలేదు. దైవికంగా జరిగే సంఘటనలకు మరీ యింతగా లబో దిబోమని మొత్తుకోవడ మెందుకో?

గోపాలం ఆలోచనల్లో పడ్డాడు.

చీర చెంగులో కళ్లొత్తుకుంటూ, ముక్కు చీదుకుంటూ శకుంతల యింటికి వస్తూనే అంది:

"పాపం ఆ బి. డి. వో. భార్యనూ, అయన్నూ చూస్తే కడుపు తరుక్కుపోతుంది."

శకుంతలవైపు గోపాలం వింతగా చూశాడు.

"యింజనీరింగు చదువుతున్న ఆ వొక్క కుర్రాడూ పోతే యెంత కడుపుకోతో చూడండి. యేం మాయరోగాలో? మనడాక్టర్లకు తెలియవు. తమకు తెలియవని చెప్పరు. రోగిని చంపుతారు. అన్యా

యంగా. రెండురోజులకు ముందు ఆ అబ్బాయిని వేలూరుకు తీసుకొని పోయుంటే బతికేవాడట! బి. డి. వో. గారికేమండి? మూడు తరాలకు సరిపోయే డబ్బుంది. రెండు చేతులా సంపాదించాడు. ఆయన తలచుకుంటే వేలూరుకు పోవటమెంత? యిలాంటి కష్టాలొస్తే మనలాంటి వాళ్ళం దిక్కుతోచక చావాలికానీ. పాపం! మనవూరి పెద్ద డాక్టర్ను నమ్మి. గోడు గోడు మంటున్నారు. సుగుణమ్మ టీచరూ, నేనూ వెళ్ళి చూశామా? అబ్బ! ఆ బాధ చూల్లేకపోయాం.''

శకుంతల కళ్లొత్తుకోవడం మానలేదు.

"మీరూ పోయి పలకరించండి."

"ఆయనతో పెద్దగా పరిచయంలేదే.''

''కష్టాల్లోవున్న మనుషుల్ని వోదార్చటానికి పరిచయం కావాలటండీ. మీరు మరీ అన్యాయం. యెంతైనా యెదురెదురిళ్ళ వాళ్ళం. వెళ్ళకపోతే నలుగురూ యేమనుకుంటారు? సమితి ప్రెసిడెంటుకూడా చూచి వెళ్లారు. వూళ్లోని ఆఫీసర్లూ, మీ హైస్కూలు టీచర్లూ యింకా చాలా మంది చూచి వెళుతున్నారండి. వెళ్లిరండి.''

''వెళ్లిమాత్రం యేం చేయాలి?''

"అలా మాట్లాడతారేం. మరీ టౌనువాళ్ళలాగా దామోదరం భార్య నన్నూ, సుగుణమ్మనూ పట్టుకొని యెంతగా యేడ్చిందనుకున్నారు. మేమేం చుట్టాలమా? కులస్తులమా? కష్టాల్లో వొకరికొకరు. ఆవిడ మనసెంతో మెత్తనండీ. లేకపోతే అలాయేడుస్తుందా? పాపం గర్వపు ముండ అని తిట్టేదాన్ని ముందు తెలీక. ఆయన

మాత్రం పసిపిల్లాడిలా యేడుస్తున్నాడు. వెళ్ళిరండి. యింత యిదే మండిమీరు. యేడ్పించే కథలు రాస్తారు. పైగా."

దైవికమైన చావుల్తో కాదు - మనసులో అనుకున్నాడు గోపాలం.

"పాపం! వెళ్ళిరండి."

శకుంతల కన్నీళ్ళనూ, "పాపం" సానుభూతినీ భరించేదాని కన్నా అక్కడికి వెళ్ళిరావటమే మేలనుకున్నాడు గోపాలం. దామోదరం కాంపౌండులోకి వెళ్ళి గోపాలం ఆ దృశ్యాన్ని చూచాడు.

దామోదరం గోడుగోడున యేడుస్తున్నాడు. యే మగవాడూ, యే తండ్రీ; యే ఆడదీ; యే తల్లీ యేడ్వనంతగా యేడుస్తున్నాడు. కొడుకు శవాన్ని గట్టిగా వాటేసుకొని బిగ్గరగా యేడుస్తూంటే లేవనెత్తి వోదార్చటానికి ప్రయత్నం చేసిన ప్రతి మనిషి భుజంమీదా వాలిపోయి లబలబా మంటున్నాడు. కొడుకు శవంమీద వేసిన పూల దండల్ని తన మెళ్ళో వేసుకొని పిచ్చిపిచ్చిగా అరుస్తున్నాడు.

కరుణరస సన్నివేశాల్లో తెలుగు సినిమాల్లోని పాత్రల్లా చూచే వాళ్ళ గుండెలు గానుగలో చెరుకాడించినట్లు యేడుస్తున్నాడని గోపాల మనుకున్నాడు. కుర్రాడి శవాన్ని చూస్తూనే అతనికి దుఃఖం రాలేదు. కానీ ఆ వాతావరణంలో కాసేపటికి అతని గుండె బరువెక్కింది.

దామోదరం భార్య వొకవైపు పడిపోయింది. కూతురు తల్లి మీద పడి యేడుస్తోంది. దామోదరం పిచ్చిపిచ్చిగా పలవరిస్తున్నాడు:

"బాబూ నా పాపాలు నిన్ను కొట్టుకున్నాయిరా. నన్నుంచి

దేవుడు విన్ను తీసుకపోయాడు. నా ప్రాణాలు తీసుకోండి. నా కొడుకునెవరన్నా బతికించండి. నా కొడుకును బతికించండి....!!"

గోపాలం మనసు అవశమయింది. యే మంత్ర శక్తిలో అతని వద్ద ఆ క్షణంలో వున్నట్లయితే దామోదరం కొడుకును గోపాలం బ్రతికించేవాడే. కొడుకును చంపి, లంచగొండి దామోదరానికి దేవుడు సరైన శిక్ష వేశాడనుకోవటానికి గోపాలం కించపడ్డాడు.

గోపాలం దామోదరం దగ్గరకుచేరి వోదార్చాడు:

"వూరుకోండి. మీరే యిలాగయితే యెలా! అన్నీ తెలిసిన వాళ్ళు, యింట్లోవాళ్ళకు ధైర్యం చెప్పాల్సిన మీరే యిలా బాధపడితే యెలా? మంచి డాక్టరుకు చూపించారు. మంచి మందులిప్పించారు. మీరు చేయగలిగింది చేశారు.

గోపాలం భుజంమీద వాలిపోయి దామోదరం బోరున యేడ్చాడు. మళ్ళీ శవంమీదపడి నెత్తీ నోరూ కొట్టుకోవడం మొదలు పెట్టాడు. గోపాలం అక్కడ నిలువలేక దుఃఖ భారంతో బయటికి నడిచాడు.

ఆ సాయంత్రం హైస్కూలు ప్లేగ్రౌండులో గోపాలం, అతని మిత్రులు దాసు, కృష్ణారావు, డేవిడ్, శంకరయ్య కూర్చున్నపుడు, మాటల్లో దామోదరం కొడుకుచావు ప్రస్తావన వచ్చింది. శ్మశానానికి వెళ్ళే తోవలో దామోదరం చేసిన అఘాయిత్యం, శ్మశానంలో కొడుకు శవంతోపాటు గుంతలో పడ్డానికి దామోదరం చేసిన ప్రయత్నం వొక కథలా చెప్పి తెలుగు పండిట్ కృష్ణారావు "విధి క్రూర

మైంది'' అన్నాడు. డేవిడ్, శంకరయ్యా దామోదరం మీద యెంతో సానుభూతిని వర్షించారు.

దాసు మండి పడ్డాడు:

''దామోదరం కొడుకు చావూ. దామోదరం యేడ్పూ చూసి నేనేడ్వలేదు. కానీ చుట్టూ మనుషుల్ని చూస్తే యేడ్వాలో. నవ్వాలో అర్థంకాలేదు. దామోదరం కొడుకు చస్తే, దామోదరం చేసిన ఛండాలపు పనులన్నీ మరచిపోయాం - అతనిమీద జాలితో. మనిషి అలికిడవుతే నిద్రలో కూడా లంచంకోసం చేయిచాపే దామోదరం కన్నీళ్ళతో మనం మోసపోతున్నాం. కూటిక్కూడా జరగని యెలిమెంటరీ స్కూల్ టీచర్లదగ్గర చేతికందినంత గుంజే అతనివి నిజమైన కన్నీళ్ళేనా? నాకనుమానం. లంచమేలేదనీ, సమితి ప్రెసిడెంటు గ్రూపు కాదనీ, యెదురు తిరిగే వాడనీ; తనకిష్టంలేని వాళ్ళను శంకరగిరి మాన్యాలు పట్టించే బి. డి. వో. మీద జాలి పుట్టింది. బి. డి. వో. దామోదరాన్ని మంచి అనే రైతు మన తాలూకాలో వొక్కడుంటే ముక్కు కోసుకుంటాను. యిప్పుడో, యీ సంవత్సరం యెలక్షన్లో దామోదరాన్ని నిలబడమనండి. వేల వోట్ల మెజారిటీతో గెలుస్తాడు. యెలక్షన్లముందు పెళ్ళాం చస్తే పాపమని మొగుడికీ, మొగుడుచస్తే అయ్యో పాపమని పెళ్ళానికీ వోట్లువేసి గెలిపించే జాతి మనది. అసలు దామోదరమంతగా యెందుకేడ్చాడంటారు? కూతురు చచ్చినా, పెళ్ళాం చచ్చినా యేడ్వడని నా నమ్మకం. వొక్క లక్ష రూపాయలు తేకుండానే కొడుకు చచ్చాడే అని దామోదరం గోల''

''మరీ అన్యాయంగా మాట్లాడకు. యీ సంఘటనతో దామో

దరం మారతాడు. అతని అంతరాత్మ మేలుకుంది'' డేవిడ్ మాటకు కృష్ణారావు. శంకరయ్యా బలపరచారు.

"యీ పరిస్థితుల్లో దామోదరం మారడు. కొడుకు చావుతో నే మారా లనడం కూడా న్యాయంకాదు. యిక అంతరాత్మ మారటమంటారా? అంతరాత్మలు మనం యెలా ఆడి స్తే అలా ఆడతాయి. అవి మన చేతుల్లో తోలుబొమ్మలు. డబ్బుకెప్పుడూ లోకువే. మీరు చూస్తారుగా. అనుభవం నుంచీ కూడా నేర్చుకోరే అని నా బాధ! యేమంటావురా రచయితా?''

''వాడనేదేముంది? మీరిద్దరూ వొకటే" శంకరయ్య అన్నాడు.

''కాదు. గోపాలం గాడింకా దేశంలో మానవత్వం మిగిలిం దనే అనుకుంటున్నాడు." సీరియస్‌గా దాసు అన్నమాటలకు గోపాలం విచిత్రంగా దాసువైపు చూశాడు.

దామోదరం మీద సంభాషణ ఆ సాయంత్రం అలా సాగింది.

వారం రోజుల తర్వాత వొక వుదయం దామోదరం గోపా లం యింటికి వచ్చాడు. కృతజ్ఞత తెలిపాడు:

"మీరూ, మీ ఆవిడా యీ కష్టకాలంలో యెంతో సాయపడ్డారు"

''మీరు ఆఫీసుకు వెళ్ళటంలేదా?"

''నా మనసేం బాగులేదు. ఆఫీసుకు మరో పదిరోజులు సెలవు పెట్టాను. యేవైనా పుస్తకాలుంటే యివ్వండి''

గోపాలం తన దగ్గరున్న కొన్ని నవలలు తీసి యిచ్చాడు. వొక నవల పేజీలు తిప్పుతూ దామోదరం అడిగాడు:

"యేవైనా వేదాంతంమీద పుస్తకాలిస్తారా?"

"మా యింట్లో యేవీ లేవే. మీకభ్యంతరం లేకపోతే యీ బైబిల్ చదవొచ్చు మీరు"

"అన్ని మతాలూ వొకటే. పాపుల్ని వుద్ధరించటంలో జీసస్ దయ గొప్పది - మన దేవతలకన్నా." దామోదరం నిట్టూర్చాడు.

పక్కింటి సుగుణమ్మటీచరు దగ్గర శకుంతల తెచ్చుకొన్న బైబిలును గోపాలం దామోదరానికిచ్చాడు.

గోపాలంతో దామోదరం పరిచయం యిలా పెరిగింది. రోజూ సాయంత్రం దామోదరం గోపాలంతో వేదాంత చర్చ చేసేవాడు. గోపాలానికిది బాధగానే వున్నా, మౌనంగా భరించేవాడు.

దామోదరానికి సానుభూతి కావాలి. మనశ్శాంతి కావాలి. అందుకు తనొక సాధనం మాత్రమే. నష్టమేముంది? పోనీలే అనుకున్నాడు గోపాలం.

పదిహేను రోజులు గడిచాయి. దామోదరం పుత్రశోకంనుంచి తేరుకున్నాడు. దామోదరం పరిచయం స్నేహమని గోపాలం మురిసిపోలేదు; వూసుకొని తిరగనూలేదు. అయితే బి.డి.వో దామోదరంతో గోపాలానికి పనిబడింది.

వొకరోజు గోపాలం దగ్గరకు అతనికి చిన్నతనంలో చదువు చెప్పిన రామరాజు మేస్టారు వచ్చి, తన ట్రాన్స్ఫర్ గోడు చెప్పుకున్నాడు:

"వారే గోపాలం! నేనెప్పుడూ మనవూరు కదలి వెళ్ళలేదు. మేనేజుమెంటు స్కూలుగా వున్నప్పట్నుంచీ మనవూళ్ళోనే ముప్ప

యేళ్ళ సర్వీసు అయిపోయింది. యిక నాకుండే సర్వీసు రెండేళ్ళు. యిప్పుడు ట్రాన్స్ఫరుమీద యీ టౌనుకువేస్తే నేనెక్కడ వచ్చేదిరా? బండెడు సంసారాన్ని యీ వయసులో టౌన్లో యీదగలనా చెప్పు? మనవూళ్ళో యేదో యింత కాళ్ళు ముడుచుకొని పడుకోటానికి గూడేదో వుంది. యింకా పాతకాలం మనుషులు వొకరో యిద్దరో వుండబట్టి యిన్ని తిండిగింజలు. యింత పాలు. పెరుగు వస్తున్నా యి- ఖర్చులేకుండా. పస్తులుండటంలేదు. యీ టౌన్లో. అద్దెకొంపల్లో. యీ ధరల్లో యేం కొని. యేం తిని బతకమురా? నీకు పుణ్యముంటుంది. నీకు తెలిసినవాళ్ళేవళ్ళతోనన్నా చెప్పి యీ ట్రాన్స్ఫర్ ఆపుచేయించు. నిన్ను నమ్ముకొని యింతదూర మొచ్చినాను'' రామరాజు కన్నీళ్ళు పెట్టాడు.

గోపాలం కరిగిపోయాడు.

బి. యిడి. అసిస్టెంట్ తానే టౌన్లో యింత వైభవంగా బతుకుతున్నాడు. యింకా పిల్లా పీచూ లేకపోయినా. ఆయనేం బతుకుతాడు- అదీ యీ వయసులో? యేమన్నా అనుకోనీ యీ ట్రాన్స్ఫర్ ఆపు చేయమని దామోదరాన్ని అడగాలి. దామోదరం సానుభూతి చూపక పోడు. అతనూ మనిషే.

గోపాలం నిశ్చయం చేసుకొన్నాడు. దామోదరంతో రామరాజు విషయం చెప్పాడు. వారంరోజుల్లో రామరాజు రిటెన్షన్ ఆర్డర్సు చేతికొచ్చాయి. దామోదరమిప్పుడు కేవలం డబ్బు మనిషికాదనీ. మారిపోయాడనీ గోపాలం సంతోషించాడు.

మళ్ళీ నెల రోజుల వరకూ గోపాలానికి దామోదరంతో పని

బడలేదు. అవాళ యింటికి వెళ్ళేవేళకు సుగుణమ్మ కళ్లుతుడుచుకుంటూ వాకిట్లో యెదురయింది. అన్నం తింటూ "సుగుణమ్మ యెందుకలా యేడుస్తూ వెళ్ళిపోయిందీ?" అని గోపాలం శకుంతల నడిగాడు.

"పాపం సుగుణమ్మ వుద్యోగం పోయింది!"

"యెప్పుడు?"

"నిన్న ఆర్డరు వచ్చిందట! ఆ రోగిష్టి తల్లితో. తండ్రిలేని పిల్లల్తో దిక్కులేంది. యెలా అవస్థపడుతుందో-యే ఆధారం లేకుండా. వుద్యోగం వుంటేనే మన బతుకులు అంతంత మాత్రం"

గోపాలానికి అన్నం సహించలేదు.

"బి. డి. వో., గారితో చెప్పిచూడండి. తప్పేముంది? పాపం వొక సంసారం వీధిన బడకుండా నిలబెట్టినట్లవుతుంది. రామరాజు గారి విషయంలో సాయపడ్డారు కదా! అడగండి. సుగుణమ్మకు మాత్రం యెవరున్నారు? అన్నయ్యకు చెప్పమని వొకటే యేడ్చింది. బి. డి. వో., గారి భార్యతో చెప్పాం. పాపం ఆమె యెంతో బాధ పడింది. తను సాయం చేయలేక పోతున్నందుకు నొచ్చుకుంది. భర్త తన మాట వినడట? మిమ్మల్నే అడగమని చెప్పింది."

తన తాహతు మించిన వాటిల్లో తలదూరుస్తున్నానని గోపాలం అనుకోలేదు. సుగుణమ్మ కాపురం కూలిపోకుండా సాయం చేయటమే అతని ఆశయం.

సుగుణమ్మను తీసుకవెళ్లి, దామోదరంతో గోపాలం ఆమె సంగతి వివరించాడు. అంతా విని దామోదరమన్నాడు:

"నాకూ బాధగానే వుంది. దేనికైనా మనం కర్తలమను కుంటాం కానీ, మన చేతుల్లో యేమీవుండదు. సెలెక్టెడ్ కాండిడేట్లు యాభైమంది వచ్చి పడ్డారు-మా నెత్తిమీద. టెంపరరీ పోస్టుల్లో వున్న ముప్పయి మందిలో చాలా మంది టెర్మినేట్ అయ్యారు. పైగా యీ నాన్ అఫిషియల్స్ పెత్తనం మామీద. కొన్నాళ్లు మా కధికారాలు, కొన్నాళ్ళు వాళ్ళకధికారాలు. కప్పల తక్కెడ వ్యవహారం. అయినా వీలున్నంతవరకూ చూద్దాం. యెందుకయినా మంచిది, సమితి ప్రెసిడెంటుగారితో మాట్లాడి చెబుతాను. మీకాయన తెలియదుకదూ?"

"తెలియదు"

"యెవరితోనైనా చెప్పించగలరా?"

"మీలాటివాళ్ళే సహాయం చేయాలిగానీ రాజకీయనాయకులకు యెన్నో ఆబ్లిగేషన్స్ వుంటాయి. వాళ్ళు సులభంగా దొరకరు. వాళ్ళతో పనులు పెట్టుకుంటే యెంతకీ తెమలవు. పైగా నాలాటి వాడితో వాళ్ళకు అవసరమేముంటుంది? యేదో రకమైన అవసరముంటే తప్ప వాళ్ళు ముగ్గులోకి దిగరు; యెవరు చెప్పినా. యెవరితో చెప్పించినా. సుగుణమ్మ పరిస్థితి మీకు తెలుసు. పైగా మన లాంటి వుద్యోగి. దయచేసి హెల్ప్ చేయండి. యీ వుద్యోగం లేకపోతే ఆమె పరిస్థితి మీరే వూహించండి"

"వొక నెల రోజులాగండి చూస్తాను."

గోపాలం నెలరోజులు వోపిక పట్టాడు. సుగుణమ్మ నెల రోజులు లెక్కపెట్టుకుంటూ గడిపింది.

నెల రోజుల తర్వాత యేవో అడ్మినిస్ట్రేషన్ గొడవలనిచెప్పి దామోదరం మరో పదిరోజులాగమన్నాడు. లోన్సు గొడవలవల్ల మళ్ళీ పదిరోజులు.

సుగుణమ్మ యింటి పరిస్థితి శకుంతలద్వారా విని గోపాలం తల్లడిల్లిపోయాడు. శకుంతల కొన్నాళ్ళు అయిదో పదో సర్దింది. కొన్నాళ్ళు బియ్యం సర్దింది. సరైన తిండిలేక ముసల్దీ, పిల్లలూ మంచాన పడ్డారు.

దామోదరంమీద గోపాలానికి పీకెలదాకా కోపం వచ్చింది. "యెటూ తేల్చకుండా యెందుకిట్లా చంపుతావు?" అని దామోదరాన్ని నాలుగూ దులుపుదామనుకున్నాడు. కానీ నిగ్రహించుకొని యెలాగైనా బతిమాలి సుగుణమ్మ సంసారాన్ని కాపాడమని చెప్పుదామని గోపాలం దామోదరం యింటికి వెళ్లాడు. యేదో క్యాంపుకు పోయాడని యింట్లో సమాధానం వచ్చింది.

యెలాగో వొకరోజు గోపాలం దామోదరాన్ని ఆఫీసులో చిక్కించుకున్నాడు. కన్నీళ్ళ పర్యంతమై, నానాటికీ అధ్వాన్నమవుతున్న సుగుణమ్మ సంసార పరిస్థితులను గోపాలం దామోదరానికి విన్నవించాడు. విని గోపాలానికి, దామోదరం తత్వబోధ చేశాడు:

"చూడండి! యిలాటివాటికి మరీ సెన్సిటివ్‌గా వుండకూడదు, లోకంలో బాధలన్నీ మనమే తీర్చగలమా చెప్పండి?"

"లోకంలో బాధలన్నీ మీరూ నేనే తీర్చలేం. కానీ పక్క మనిషి నోటిదగ్గరకూడు పోతున్నప్పుడు చెయ్యగలిగిన సాయం

చెయ్యవచ్చు. చేసే సాయమేదో యిలాంటప్పుడే అవసరం. చచ్చాక కాదు. బతికినప్పుడవసరం!''

గోపాలం మాటల్లోని వ్యంగ్యానికి దామోదరం చలించలేదు.

"సెక్షన్ క్లర్కును చూడండి. నాకు తీరికలేదు. అర్జంటుగా జిల్లా పరిషత్ ఆఫీసుకు వెళ్ళాలి.''

దామోదరం జీప్ యెక్కి వెళ్ళిపోయాడు.

దింపుడు కళ్ళం ఆశగా, గోపాలం సెక్షన్ క్లర్కునుచూశాడు. సెక్షన్ క్లర్క్ చిద్విలాసంగా అన్నాడు:

''మాటల్తో పనులెట్లా అవుతాయండి? మా టయిమెందుకు వేస్టుచేస్తారు? ప్రెశిడెంటు చేతుల్లోకి పవర్స్ పోకముందే యేమైనా చూసుకోవడం మేలు. ఆ తర్వాత మా చేతుల్లో వుండదు. రామ రాజు విషయంలో సాయంచేశామా? యేమైనా యెన్నని ముఫత్‌గా చేస్తాం? మీరూ రాజకీయ నాయకుల్లా అయితే యెట్లా సార్?''

గోపాలం అక్కడ నిలువలేక పోయాడు.

వీళ్ళకన్నా కాటి కాపరులు నయం. గొర్రెల మందలో దూరిన తోడేళ్ళు. దామోదరం కొడుకు చనిపోయినరోజు సాయం త్రం. ప్లేగ్రౌండులో దాసు మాటలు గోపాలానికి గుర్తుకొచ్చాయి.

దాసు యీ వ్యవస్థలోని నిజాన్ని చూశాడు. దేశంలో మాన వత్వ మింకా మిగిలివుందని తాను పొరపాటు పడ్డాడు. తాను సెంటి మెంటల్‌ఫూల్! తన సెంటిమెంటలిజమ్ తను సృష్టించే సాహిత్యం ద్వారా సమాజానికి ప్రమాదకరం! దామోదరం మనస్తత్వంలోని

వైరుధ్యం యెంత అమానుషమైంది? దామోదరంలో నిండిన యీ వ్యవస్థ యెంత పాశవికమైంది?

గోపాలం గుండె బరువుతో యింటికిచేరాడు.

శకుంతల ఆతురతగా అడిగింది:

"యేమైంది?"

"నువ్వూ నేనూ బాధపడితేనే సుగుణమ్మకు వుద్యోగం వస్తుందను కున్నావా? డబ్బుంటే వస్తుంది''

"గతకటానికి సుగుణమ్మ దగ్గరేముంది? ఆమెనూ ఆపిల్లల్నూ పీక్కుతినాల్సిందే. రాక్షసులు నయం!"

"వీళ్ళను సహిస్తున్న మనమో?" పెన్‌లో యింకి పోసుకుంటూ గోపాలం అప్రయత్నంగా ప్రశ్నవేశాడు.

నవంబర్ 1973.